# నిర్ణయం



'వైజయంతి'

## ప్రవేశిక

ఆంధ్ర రాష్ట్రంలో - అందునా కృష్ణా, గుంటూరు, ఒంగోలు మొదలైన కొన్ని జిల్లాలలో పొగాకు పరిశ్రమ వుంది. పరిశ్రమతో పాటు పొగాకును కొనుగోలు చేసే ఎన్నో వ్యాపార సంస్థల బ్రాంచీలు అంతటా విస్తరించి వున్నాయి.

చాలా కంపెనీలలో సీజనల్ ఉద్యోగులు అన బడే ఒక వింత తరగతి వుద్యోగులున్నారు. వాళ్ళకు షుమారు 5 నెలలు వుద్యోగమూ, 7 నెలలు నిరుద్యోగమూను. ఇంకా బ్రాయాలంటే వారిలోనే క్రొత్తగా చేరినవాళ్ళు ఒక్క నెల పన్జేసి సంవత్సరంలో మిగతా కాలమంతా నిరుద్యోగులుగానే వుండిపోతున్నారు.

వారి జీవితాలకు నిర్దిష్టమైన ప్రణాళిక లేదు. ఈ గమనానికి ఫలానా గమ్యమనే ఆశ లేదు. ఇరవై సంవత్సరాలకు పైగా యిలా సీజన్లో పని చేస్తూ స్థిరం గాని యీ ఉద్యోగాలలోనే యీ ఉద్యోగులు తాతలుకూడా ఔతున్నారు.

అలాంటి ఒక వుద్యోగి జీవితంలో ముఖ్యమైన రెండేరెండు సంఘటనలే ఈ కథ. కథాకాలం : 1967.1969 సంవత్సరాల మధ్య.

## 1

ఒంగోలు నుండి గుంటూరు పోయే ట్రంకు రోడ్డుమీద మన్నుతిన్న పాములా సాగిపోతున్న డొక్క ఆర్. టి. సి. బస్సు.

బస్సులో జనం అంతా కలిసి ఇరవైమందికి మించిలేరు. ఆ ఇరవై మందిలో సుబ్బారావు కూడా వున్నాడు.

అతని మనసు తీవ్రమైన ఆలోచనల మధ్య నలుగుతున్నందుకు గుర్తుగా చేతిలోని కాగితం లెక్కలేనన్ని మడతలతో అంతకంతకూ చిన్న సైజుకు మారిపోతున్నది.

కొంతసేపయాక ఆ ఆలోచనల మధ్యనే తన చేతిలోని కాగితం మడతలు విప్పి మరోసారి చూసుకున్నాడు సుబ్బారావు. తన అసమర్థతకు తనమీద తనకే అసహ్యం కల్గిందతనికి. తానేకాదు. తన బోటి వుద్యోగస్తులెందరో యిలాంటి పరిస్థితులలో అసమర్థులై పరిస్థితులకు లొంగిపోతున్నారు.

కాగితంలోని విషయాలు అతని బాధలను వెయ్యిరెట్లు చేస్తున్నాయి.

ట్రాన్స్ఫర్ :

ఇక్కడ ఈమూల ఒంగోలు తాలూకానుండి అక్కడ ఆమూల గుంటూరు తాలూకాకు.

ఈ సంవత్సరం ఇది మూడో ట్రాన్స్ఫర్ అయితే క్రిందటి రెండుసార్లూ ఒంగోలు ప్రాంతంలోనే అటూ ఇటూ తిరగడం జరిగింది.

ఈ సంవత్సరం తాను చేరినచోట అనుకొన్నంతగా వ్యాపారం సాగలేదని మొదటిసారి కారణం. తనను మార్చిన చోటికే మేనేజరుకు ఇష్టుడైన వాడు మరొకడు వస్తాననడం మసిపూసి మారేడుకాయ చేయబడింది రెండోసారి.

ఇక మూడోసారి ...

భగవాన్ ఇలాటి ట్రాన్స్ఫర్లు పగవారికైనా వద్దు. ఆ మాటకొస్తే ఈ సీజనల్ వుద్యోగమేవద్దు ఎవరికీ-పొరపాటున చేరినందుకు మేం అనుభవిస్తున్నాం చాలు.

—ఇలా రక రకాల ఆలోచనల మధ్య బాధ పడసాగాడు సుబ్బారావు.

అసలు జరిగిందేమిటంటే ...... పదిరోజుల క్రితం ......

ఎంత ప్రయత్నించినా టైంలోపల పని పూర్తి కాలేదారోజు. టైంలోపల అంటే ఈ కంపెనీ అధికారులు బయట వాళ్ళనుంచీ మెహర్బానీ కోసం రికార్డులలో చెప్పుకున్నట్లు సాయంత్రం 5 గంటలకు కాదు. గుమస్తాలంతా తట్టుకోలేని పరిస్థితుల వత్తిడికి నలిగి - రాజీపడి - కంపెనీ యందు దయ తలచి చేస్తున్నాంలే' అని సరిపెట్టుకుని వుచితంగా రోజూ పనిచేసే రెండు గంటలూ కలుపుకొని ఏడుగంటలకే!

సుబ్బారావూ తోటి గుమాస్తాలు పదిమందీ కూడా రాత్రి పదిగంటల వరకూ క్షణం తీరిక లేకుండా పన్జేస్తూనే వున్నారు.

చెయ్యవలసిందే! అవసరమైన రోజువని చేయడం ఆపి కంపెనీకి నష్టం తేవడం సుబ్బారావు అభిప్రాయంకాదు.

మర్నాడు ఉదయం హెడ్ క్లర్క్ రాజారావుతో హెచ్చరించాడు అదే విషయం. రెండుగంటలైనా ఓవర్ టైం రాయండి' అని అభ్యర్థిస్తూ.

హెడ్ క్లర్క్ మంచివాడే పాపం. "నేను స్వతంత్రించి చేసే పనికాదు సుబ్బారావ్ ఇది. మేనేజరుగార్ని అడగండి. నేనూ సమర్థిస్తాను. అదీగాక ఇంతవరకూ ఈ విషయం మిగతా వాళ్ళెవరూ అడగ లేదుకూడా' అన్నారాయన.

సుబ్బారావుకు ఆశ్చర్యమైంది. ఎవరూ అడగ లేదా? రాత్రి పదిగంటల వరకూ వెట్టిచాకిరీ చేసి అడిగే ధైర్యం లేక వూరుకుంటున్నారా! ఈ

గుమాస్తాలలో ఇలాంటి బలహీనతలు జీవం పోసుకుంటున్నాయేం రోజు రోజుకూ!

వెంటనే అతనే వెళ్ళి పదిమందితో సంప్రదించి, ఆ పది మందిలో కూడా గట్టిగా అడగాలనే వ్యూహాను నాటి చెప్పుకొని - వాళ్ళచేత సరేనని పించుకొని మేనేజరు వరకు విషయాన్ని కదిలించాడు.

మేనేజరు మరీ మంచివాడు. మహా జ్ఞాని. మిగతా గుమాస్తాలు ప్రక్కనున్నారనే ఆలోచనైనా లేకుండా ప్రారంభించాడు హెడ్‌క్లర్కుతో: 'ఒక్కరోజు ఇరవై గంటలకుపైగా ఓవర్ టైం చేయించావే ఎవర్నడిగి చేయించావయ్యా రాజారావ్? ఇప్పుడు వాళ్ళకు సమాధానం కూడా నువ్వే చెప్పు ఏం చెప్తావో!'

హెడ్‌క్లర్కు మొహంలో రంగులు మారాయి. 'నిన్న పని ... ఎక్కువగా వుంటే ...' నాన్చలేక నాన్చలేక తంటాలు పడ్డాడా మహాశయుడు.

నిన్న సాయంత్రం పని పూర్తిచేయించడం మానేజరుకూ ఇష్టమేననీ, ఎటొచ్చీ ఇష్టం లేనిది ఓవర్ టైం ఇవ్వడం విషయమేననీ. "తననిలా ప్రశ్నించడమూ, నిలదీయడమూ అనవాయితీ కోసమే గానీ, కోపంతో కాదనీ రాజారావుకు స్పష్టంగా తెలుసు.

"నాకు ముందుగా చెప్పాలయ్యా ఆ మాట. నేను పై వాళ్ళ కేంచెప్పుకోను! ఇంకెప్పుడూ ఇలా చెయ్యకు" అని మళ్ళీ సుబ్బారావు ఈ సారికి ఇలా పోనివ్వండి. మరోసారి అలాగే తప్పకఇస్తాను-" అన్నాడు మేనేజర్ సుబ్బారావుతోనూ మిగతావారితోనూ.

"పోనియ్యడమేమిటి సార్! రోజూ రెండు గంటలు చేస్తున్నా వృథాగానే పోగొడ్తున్నారు. నిన్నఅందరమూ ఐదుగంటలు ఎక్కువ పనిచేశాం" సుబ్బారావు అన్నాడు స్థిరంగా.

మేనేజర్ గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్ తీసి పెదాలమధ్య వుంచుకొని లైటరుతో వెలిగించుకున్నాడు.

రోజుల్లో ఎక్కువ కాలాన్ని ఎయిర్ కండిషన్ గదుల్లో విలాసంగా, ఆనందంగా, హాయిగా గడిపేందుకు అలవాటుపడ్డ అంతటి మేనేజరు - సంవత్సరంలో 6 నెలలు మాత్రమే పనిచేసే ఒక చిన్న తరహా వుద్యోగి కష్టసుఖాలను గురించి అర్థంచేసుకునేపాటి విశాలహృదయమూ, మానవత్వమూ కల్గివుండడమంటే చాలా అరుదైన విషయమది.

హెడ్‌క్లర్కు చెప్తోన్న మాటలు ఏ రోజు కా రోజు వింటున్నందువల్ల ఈ పరిస్థితి వస్తుందని ఆయనకు ముందే తెలుసు. అయినా పెద్ద హీరో లాగా పోజు - నటన!

ఇంతలో ఒక నిర్ణయానికి వచ్చి ఒక్కసారి పొగ గాలిలోకి వదిలి అన్నాడు విలాసంగా భుజాలెగురవేసి: "వెరీగుడ్. అలాగే కానివ్వండి రాజారావ్! అలాగే రాసెయ్. ఇక మీరు వెళ్ళి మీ పని చూసుకోండి."

సుబ్బారావూ మిగతావాళ్ళు అంతా కృతజ్ఞతలు తెలిపి బయటకు వచ్చారు.

[ఇక్కడ పాఠకులు ఒక విషయం తెల్సుకోవడం అవసరం. సుబ్బారావు పని చేస్తున్నది ఒక చిన్న బ్రాంచిలో. ఇంకా విపులంగా వ్రాస్తే 'బ్రైయింగ్ పాయింట్' లో - మేనేజరు అంటే ఇలాంటి బ్రాంచీలు కొన్నింటిమీద అధికారి. రోజుకు ఒకో బ్రాంచీకి తన అమూల్యమైన కాలంలోనుంచి షుమారు ఒకటి, రెండు గంటలు మాత్రమే కేటాయించ గలుగుతాడు ఆ అధికారి. ఈ కారణాల వల్ల రాత్రి ఎవరు ఎన్నింటి వరకు పని చేసిందీ తాను స్వయంగా చూచుకొనే అవసరమూ, అవకాశమూ మేనేజరుకు లేవు.

ఇక పోతే యీ బ్రాంచీలలో హెడ్‌క్లర్కులుండరు. వీనిని నిర్వహించే వుద్యోగిని "ఇన్‌ఛార్జి" అంటారు. ఆ 'ఇన్‌ఛార్జి' నే ఈ వాతావరణంతో పరిచయం లేని పాఠకుల సౌకర్యార్థం హెడ్‌క్లర్కు అని వాడడం జరుగుతున్నది.]

మేనేజరు గదిలోనుంచి బయటకు వచ్చాక వెంటనే పనిలోకి వెళ్ళలేదు సుబ్బారావు. అతనికి తెల్సు తర్వాత ఎలాంటి సంభాషణ జరిగేది అందుకే తప్పు అనితెల్సికూడా చాటుగా వినకుండా వుండలేకపోయాడు.

"రాజారావ్! నీ పద్ధతేం బాగాలేదయ్యా. గంటో అర్ధగంటో నువ్వే రాసేయ్ నాదాకారారు. ఇప్పుడు చూడు ఇరవై గంటలు ఓవర్‌టైంఇచ్చాం, ఇక రేపు మనమాట వింటారావాళ్లు!"

"ఇక అలాగే చేస్తానండీ" చేతులుకట్టుకున్నాడా వుద్యోగి విధేయతగా.

"సరి సరి. ఓవర్ టైం విషయం నిగ్గదీసి అడిగేది సుబ్బారావు ఒక్కడేనా మరెవరైనా వున్నారా?"

"లేరు సార్"

ప్రక్కగావుండి వింటున్న సుబ్బారావు ఇవతలకు వచ్చేశాడు.

అతని హృదయం ప్రతీకార వాంఛతో ఉధృతంగా ఎగిరి పడుతున్నా ఆ కోపాన్ని బయటకు వెళ్ళగ్రక్కలేక - లోనికి మింగి ఇముడ్చుకోలేక సతమత మయ్యాడతను.

ఇలా బ్రాంచీలను నిర్వహిస్తున్న వుద్యోగులంతా - రాజారావులా తమ ప్రమోషను కోసం పైవారి అడుగులకు మడుగులొత్తే ఆత్మవంచకులు కాకుండా - న్యాయానికి, ధర్మానికి నిలబడి తన తోటి వుద్యోగుల శ్రేయస్సుకోరే మంచి మనసు కలవారైతే ఎంత బాగుండును.

ఆ ఓవర్‌టైం సంఘటనకు ప్రతిఫలంగా ఈ కాగితం చేతికందింది ఈ రోజు. ఎవరో అన్నట్టు జీవితం అంటే కష్టాలలో పుట్టి సుఖాలు వెతుక్కోవడమేనేమో. ఆ సుఖాలనేవి కనుచూపుమేర దూరంలో లేనే లేవు!

ఈ ట్రాన్స్‌ఫర్‌ను ఎదుర్కోనేందుకు అవకాశాలు లేకుండా పోలేదుగానీ, ప్రయత్నించినా సవాలక్ష కారణాలతో తమను తాము సమర్థించుకుంటారు పైవాళ్ళు. అంతకైతే నాలుగు అబద్ధపు కారణాలు సృష్టిస్తారు.

అసలు తను పుట్టి పెరిగిందీ, నివసిస్తున్నదీ కర్నూలు జిల్లాలో. సంవత్సరానికి 6 నెలలు ఈ వుద్యోగం. ఒంగోలు జిల్లాలోనో, గుంటూరు జిల్లాలోనో! అదీ రాత్రింబవళ్ళ చాకిరీ. ఏ రోజు

# క్రాంతి గీతి

**— అదృష్ట దీపక్**

మనిషి మనిషిలో మమతల
మధువులు చిందింపజేయు
పరమ రమ్యమైన పాట
పాడాలని ఉంది నాకు!

నైరాశ్యపు భావనలో
చెలరేగిన చీకటిలో
చైతన్యపు దీపాలను
వెలిగించాలని ఉన్నది!

సమ సమాజ ప్రాంగణాన
మానవతా విలసితమగు
రంగవల్లి కల బారులు
రచియించాలని ఉన్నది!

అభ్యుదయాన్నరి కట్టే
మలమతాల భూతాలను
కట్టి భోగి మంటలలో
కాల్చాలని ఉంది నాకు!

పసిపాపల చిరునవ్వుల
బంతిపూల తోరణాలు
ఇంటింటా వెలసినపుడు
చూడాలని ఉంది నాకు!

మనిషి మనిషిలో మమతల
మధువులు చిందింపజేయు
పరమ రమ్యమైన పాట
పాడాలని ఉంది నాకు!!

---

ఏ వూళ్ళోనో తెలీదు. ఈ నెల మొత్తానికి వెళ్ళించిన అద్దె అంతటితో సరి! హోటల్లో కొన్న భోజనం టికెట్లు ఎందుకూ కాకుండా వేస్ట్!! కొంచెం డెవలప్ అయిన ఇలాంటి వూళ్ళలో కనీసం నెల రోజులకైనా అడ్వాన్సు ఇస్తేగానీ గదులు అద్దెకివ్వరు మరి! హోటల్లో భోజనం టిక్కెట్లూ అంతే!

తనూ మిగతవాళ్ళలా ఓవర్‌టైం అడగకుండా వెట్టిచాకిరీ చేయగల్గితే తననూ కదల్చరు ఇలా వారం వారం. కానీ తన మనస్సందుకు ఒప్పుకోదు.

ఏం? ఎందుకు ఒప్పుకోవాలి?

తాము తమ వుద్యోగులకు ఓవర్‌టైం "పే" చేస్తున్నామని పదిమందిలోనూ గప్పాలు కొట్టుకొనే మేనేజ్‌మెంట్ - ఇలా ఇన్‌డైరెక్టుగా ఇవ్వకుండా తప్పించుకొనేందుకు ప్రయత్ని

ష్తుంటే ఎందుకు సహించి పూరుకోవాలి?

ఇంతవరకూ ఎందుకు రావాలి అసలు?

ఇరవై సంవత్సరాల క్రితం వుద్యోగంలో చేరినరోజు ఎన్ని ఆశలతో జేరాడు తను. నాలుగైదేళ్ళలో పర్మినెంటవు తుందనీ, కష్టాలతో వేగిపోతున్న తన కుటుంబం సుఖాల తీరాలవైపు పయనిస్తుందనీ, తానూ ఒక మనిషిగా తలెత్తుక తిరిగేరోజు త్వరలో వస్తుందనీ ఎన్నో అనుకున్నాడు. వార్ధక్యంలో వున్న తల్లినీ తండ్రినీ కూర్చొపెట్టి పోషించ గలననుకున్నాడు.

జీవితాన్ని గూర్చి రక రకాల ఆశలలో భవిష్యత్తును గురించి రంగు రంగుల కలలుకన్నాడు.

కానీ ఈ రోజేమైంది? ఏం మిగిలింది తనకు?

తమ కొడుక్కి వుద్యోగం స్థిరంకాలేదనే బాధచేత ధింపబడి, వేధింపబడి చివరకు తల్లీ-ఆమె వెనుకే తండ్రీ ఈ లోకం విడిచిపోయారు.

ఇందిర! అవును తనభార్య. పెళ్ళైనక్రొత్తల్లో బంగారపు బొమ్మలా వుండే ఇందిర, ఈ రోజు తిరుగులేని అనారోగ్యంతో చిక్కి-శల్యమై తనకే భయాన్ని కల్గిస్తోంది ఒకోసారి.

స్త్రీ ఎందుకు వివాహం చేసుకుంటుంది? ఏం కోరుకుంటుంది జీవితంలో?

తనను చేసుకున్నవాడి జీవితాన్ని సుందరమైన నందనవనంగా తాను తీర్చిదిద్దగలగాలనీ, తన జీవితంలో కోటి పున్నమి రాత్రులు ఒక్కసారిగా వెన్నెలలు వెదజల్లేటంత అదృష్టం ఎదురవాలనీ కోరుకోదూ!

కానీ తనేంచేశాడు ఇందిరను? ఆమెవల్ల తన జీవితాన్ని చక్కదిద్దుకోవడ మలావుంచి ఆమె జీవితాన్నే నరకం చేశాడు. తాను చేసేశాడు.

అయితే ఇందిర సహృదయురాలు కనుక భర్తను అర్థంచేసుకోగల్గింది. భర్త అభివృద్ధి వినిరోధిస్తున్న మహాశక్తిని గుర్తించగల్గింది. ఎప్పటికైనా ఒక మంచి రోజు వస్తుందేమోననే ఆశతో జీవితం నెట్టుకొస్తోంది.

మోహన్! భగవాన్..మోహన్ తనకొడుకు!

రెండేళ్ళమందే వుద్యోగంరాని నిరుద్యోగి. తండ్రి వుద్యోగం చేస్తున్నా పరాయివాళ్ళ దయాధర్మాలమీద చదివి ఫస్టుక్లాసులో డిగ్రీ తెచ్చుకున్న నిర్భాగ్యుడు- వుత్తరాయణాలూ, దక్షిణాయణాలూ సమకూర్చుకోలేని ఇలాంటి మోహన్‌లకు రెండేళ్ళకుగాదు పదేళ్ళకైనా నిరుద్యోగమే గతేమో ఈ దిక్కుమాలిన దేశంలో!

ఈ జీవితాలింతేనేమో ఇక! తాను ఏ సమస్యనూ పరిష్కరించుకోలేడు. రాత్రింబవళ్ళు ఆ పొగాకు బేళ్ళమధ్యా, కాగితాల కట్టల మధ్యా కష్టించి పనిచేసి సంపాదించిన డబ్బంతా ఇలా పదిరోజుల పాటువుండి నెలరోజుల అద్దె అన్నం తినడానికి నెలరోజులకు టిక్కెట్లుకొని పదిరోజులు భోజనంచేసి మిగతా సొమ్ముకు తిలోదకాలు వదలడంతో సరిపోతుంది.

తన ఈ కష్ట సుఖాలను గురించి ఆలోచించేవాడుదే లేడు నిజానికి.

తానిలాగే నిత్యమూ ఎండి మోడు వారిన శిశిరంలాగానే జీవించాలేమో!

తన ఇందిర అదుగో అదుగో అంటూ వేయి కళ్ళతో కోటి కోర్కెలతో ఎదురు చూస్తున నవవసంతం తమ జీవితాల దరిదాపులకైనా రానే రాదేమో!

మోహన్! మోహన్ కూడా చివరకు తనలాగే ఎందుకూ కొరగాని అప్రయోజకుడవుతాడేమో.

ఏమో...ఏమో...ఏమో...

బస్సు సాగిపోతూ వుంది. అతని ఆలోచనలూ సాగిపోతూనే వున్నాయి అలా అలా...

## 2

సాయంత్రం నాలుగు గంటలవేళ దిగులుగా కూర్చుని వుంది ఇందిర వీధి గుమ్మంలో.

అనారోగ్యంతో చిక్కి శల్యమై చాలా నీరసంగా వుందామె.

ఎప్పుడు ఎంతసేపు ఏడ్చిందో కన్నీటి చారికలు చంపల మీద ఆరిపోయి, మొహాన్ని మరింత అసహ్యంగా మార్చాయి. కళ్ళలో నిరీక్షణ స్పష్టంగా ప్రతిబింబిస్తోంది.

దగ్గరగా వచ్చేవరకు జానకిరామయ్య గార్ని గమనించనేలేదామె. గమనించిన వెంటనే లేస్తూ అంది. "రండి బాబాయ్ లోపలకు రండి"

జానకిరామయ్య యీ ఇంటికి నాలుగిళ్ళ అవతల వుంటున్నారు. ఇప్పుడు ఆయనే మగదిక్కు అయారు ఇందిరకు.

"సుబ్బారావు యింకా రాలేదా అమ్మా" లోనికి వస్తూ ప్రశ్నించారాయన.

"లేదు బాబాయ్"


"నువ్వు ఇచ్చిన అడ్రసు సరైనదేనా - ఇంత ఆలస్యం ఎందుకైందో!"

"సరైనదే బాబాయ్. మొన్ననే వుత్తరం వచ్చింది ఈ క్రొత్త అడ్రసునుంచి."

"సరే. అంతగా రాకపోతే రేపు నేను వెళ్ళి వెంట తీసుక వస్తాన్లే. నువ్వుదిగులు పడకమ్మా!"

"దిగులు! ఇక అదే మిగిలింది బాబాయ్ నాకు. ఇన్ని రోజులుగా ఎలాగో రోజులు నెట్టుకొచ్చేం

## లేపాక్షి శిల్పాలు



.... వై. బాలయ్య, సిద్దిపేట

దుకు తోడ్పడిన ఆశ ఈ రోజుతో నన్ను విడిచి పారిపోయింది బాబాయ్"

"అలా అనకమ్మా - కష్టాలలో సుఖాలు వెదుక్కోవలసి వస్తుంది ఒకోసారి."

"సుఖాలు! ఇంకేం సుఖాలు బాబాయ్. కష్టాలకే పుట్టాను నేను. నా పెద్దవల్ల వారికీ కష్టాలే ఎదురయ్యాయి. చేతికి అంది వస్తాడనుకున్న కొడుకు ఇలా మమ్మల్ని విడిచి వెళ్ళిపోతే ఇంకేం సుఖాలు బాబాయ్ నా గుండె బ్రద్దలవుతోంది. వారు త్వరగా వస్తే బావుణ్ను" వెక్కి ఏడుస్తూ మధ్య మధ్య మాట్లాడ్తోంది ఇందిర

"ఇదేం బాగులేదమ్మా! ఇలా మనిషి కన బడితే ఏడుస్తుంటే ఎలా? నీ కష్టం నాకు తెలుసు తల్లీ - తప్పదు. మనకు మనమే పెద్దలం. మనల్ని మనమే ఓదార్చుకోవాలి. బజారు పనుంది కొంచెం. మళ్ళీ వస్తాను"

"అలాగే బాబాయ్"

జానకిరామయ్యగారు పై కండువాతో కళ్ళొత్తుకుని చేతికర్ర భారంగా వూపుకుంటూ బయటకు వెళ్ళారు.

మంచం వాల్చుకుని పడుకుంది ఇందిర బరువెక్కిన హృదయంతో.

ఎంత పని చేశాడు మోహన్! వాడిమీద ఎన్ని ఆశలు పెట్టుకుంది తను!

తన జీవితం మొదట్నుంచి ఇలాగే అవుతూ వచ్చింది.

మోహన్ పుట్టిన క్రొత్తలో కాబోలు సుబ్బారావుకు వుద్యోగం దొరికింది. అంతా బాబు అదృష్టమని రక రకాలుగా పొగిడారు. నిజమేనేమో ననుకొంది తాను.

ఆ రోజుల్లో అనుకునే మాటలనూ అంతకు ముందున్న ఆనవాయితీని అనుసరించి నాలుగైదేళ్ళలో వుద్యోగంపర్మనెంటు అవుతుందనుకుని మురిసి పోయింది

కానీ ఆ సంవత్సరంతో పర్మనెంటు చేయడం ఆపేశారు. ఆ వుద్యోగమే తమ జీవితాలను బలి తీసుకుంటోంది.

సంవత్సరానికి ఐదునెలలు వుద్యోగం- అదీ ఒక్కచోటకాదు. కర్నూలులో కాపురం, ఒంగోలు గుంటూరు ప్రాంతాల్లో వుద్యోగం, వారానికొక వూరు. ఎందుకొచ్చిన కర్మమిది? ఏ జన్మలో చేసిన పాపఫలితమిది?

ఈ వుద్యోగం కామధేనువులా కోరికలు తీర్చేది కాదనీ, కాలనాగులా జీవితాన్ని కాటు వేసేదనీ తెల్సుకొనే సరికే సమయం మించిపోయింది.

ఆయన మరో వుద్యోగం కోసం ప్రయత్నించే అవకాశం లేకుండా వయసు 30ని చేరుకుంది.

పోనీ మిగిలిన సమయాలలో ఏ కొట్లో గుమాస్తాగావున్నా. పది మంది పిల్లలకు ట్యూషన్లు చెప్పుకొన్నా పాతిక ముప్పై రూపాయలు ఇస్తారా అంటే. 'ఏడు నెలలు పనిచేస్తాను. మిగిలిన ఐదు నెలలు మీ కర్మకు మిమ్మల్ని వదిలేస్తాను". అంటే-ఎవరైనా యిస్తారా వుద్యోగం?

అయిందేదో అయింది! అందరి జీవితాలూ వడ్డించిన విస్తర్లు కావు - అలానే రోజులు నెట్టుకొస్తుంటే తననీ క్షయకూడా దాపురించాలా కరువులో అధికమాసంలాగా!

అవును. ఈ ఇంటి పరిస్థితులలో మోహన్ కాదు, మరెవరున్నా - నిర్ణయం మరో విధంగా వుండదేమో!




ఏనాటికైనా మంచిరోజులు వస్తాయనీ, తన కోరికలు కుసుమిస్తాయనీ ఇన్నాళ్ళూ - ఇన్నేళ్ళూ ఎదురు చూస్తూనే వుంది తాను.

క్రొత్త కోడలుగా ఈ ఇంట అడుగుపెడుతూ ఎన్నో చేయాలనుకుంది. అత్తకూ, మామకూ కోడలంటే దేవత అనే భావం కల్గేలా మెలగాలనుకుంది. వాళ్ళిద్దరూ సరిగా నాల్గు సంవత్సరాలైనా బ్రతకలేదు తానొచ్చాక.

శ్రీవారికి అర్థాంగిగా అన్నివిధాలా తోడునీడై 'అదిగో అలా వుండాలి ఆదర్శ దాంపత్య మంటే' అని పదిమందిచేతా అనిపించుకోవా లనుకుంది. ఏదీ? అందుకు రకరకాల కారణాలు అడ్డొచ్చాయి, చివరకు దైవం కూడా సహకరించలేదు తనతో. దీర్ఘరోగిగా మారి ఇలా తయారైంది చివరకు

మోహన్ ... ఎడారిలా మారుతున్న తన జీవితంలో ఒయాసిస్‌లా భావించుకుంది వాణ్ణి. ఇన్నియిలా వున్నా వాడికన్నా గొప్ప స్థితిలో చూసి ఆనందిద్దామనుకొంది. ఫస్టుక్లాసులో డిగ్రీ తెచ్చుకున్నరోజు వాడికంటె ఎక్కువ ఆనందంతో పొంగిపోయింది. కానీ రెండేళ్ళ నిరుద్యోగానికే ఎంతగా విసిగిపోయాడో - వాడి నిర్ణయం వాడు చేసుకుని తన గుండెలో చిచ్చు రగిల్చి తనకు దూరంగా వెళ్ళిపోయాడు.

జీవితం అంటే ఇదేనా? అందరి జీవితాలూ ఇలాగే వుంటున్నాయా! ఇందుకు కారణం ఏమిటి? ఏమిటి??

ఆయన వుద్యోగం! అంతటి దగుల్బాజీ వుద్యోగాన్ని మిగతావాళ్ళు ఎట్లా చేస్తున్నారు? అందరి కుటుంబ జీవితాలూ ఇలాగే, యింత నికృష్టంగా, యింత దయనీయంగా, యింత భయంకరంగా వుంటూనే వున్నాయా? ఏమో ... ఏమో ...

"ఇందిరా!"

"ఎవరు? ఎవరది??" ఛివాల్న లేచింది ఇందిర. ఆయనే! ఆయనే!!

పరుగు వేగంతో వెళ్ళి అతని కాళ్ళ దగ్గర కూలిపోయింది. ధారాపాతంగా వర్షిస్తోన్న ఆమె కన్నీళ్ళతో సుబ్బారావు పాదాలు తడుస్తున్నాయి.

"ఏమిటి ఇందిరా! ఎలావుంది మోహన్‌కు?" అని విల్లాడాడు సుబ్బారావు ఇందిరను భుజాలు పట్టుకుని లేవదీస్తూ.

ఆమె సమాధానం చెప్పలేదు ప్రక్కగా గూట్లో పుస్తకంలో వున్న కాగితం తీసి సుబ్బారావు చేతికిచ్చింది. ఇచ్చి అంది. "మీకు జానకిరామయ్యగారిచ్చిన టెలిగ్రామ్ అబద్ధం. ఇదీ నిజం"

సుబ్బారావు కాగితం మడతవిప్పి అక్షరాల వెంట చూపులు పరిగెత్తించాడు.

"ప్రియమైన అమ్మకూ, నాన్నకూ

నమస్కారములు.

సుఖాల్లో పుట్టి సుఖాల్లో జీవించేవాళ్ళూ -

కష్టాల్లో పుట్టి సుఖాలు వెదుక్కొని వానిని రక్షించుకోగలిగే వాళ్ళూ -

సుఖాలలో పుట్టి పరిస్థితులవల్ల కష్టాలలోకి త్రోయబడే వాళ్ళూ -

కష్టాలలో పుట్టి కష్టాలలోనే జీవించేవాళ్ళూ - ఇలా నాలుగు రకాలుగా విభజించవచ్చు. ఈ

లోకంలోని జీవితాలను. అందులో మనం నాలుగో రకం.

అలా సౌధాలు కట్టుకుని వానిలో ఆనందంగా జీవించాలని వ్యర్థ ప్రయత్నాలు చేస్తూ వుంటాం. అంతే మన బ్రతుకు.

ఆనాడు సుబ్బారావు ! అంతగా విద్యావంతుడు కానందువల్లనైతేనేం, తెలీక చేసిన ఒకే ఒక్క తప్పటడుగు వల్లనైతేనేం. జీవితంలో ఓటమి మాత్రమే మిగిలింది చివరకు.

ఈ నాడు మోహన్ ! విద్యావంతుడైనా, మారిన కాలానికి అనుగుణంగా మారిన కుటుంబానికి చెందినవాడు కాదు గనుక ఓటమి అతన్ని అమాంతం వరించేందుకు పొంచి చూస్తోంది.

ఆ పరిస్థితి నాకిష్టం లేదు. ఆ ఓటమికి నేను బలి కాను.

అందుకే ఇలా ఇంటర్వ్యూకని బయల్దేరి వచ్చి మిలటరీలో చేరిపోయాను. ఇందులో నేను విచారించడం లేదు. మధ్యతరగతి వుద్యోగులను బానిసలుగా చూసేందుకు మాత్రమే అలవాటుపడిన ఈ దేశంలో వుద్యోగం కంటె నరకం లేదు.

వీర సైనికుడిగా నేను నా తల్లి భారతమాత ఋణాన్ని తీర్చుకుంటాను. శరీరాన్నీ, ప్రాణాన్నీ ఒడ్డి నా తల్లిపైకి దండెత్తే శత్రువులను ధైర్యంగా ఎదుర్కొంటాను.

అందుకు మీ రిద్దరూ నన్ను దీవిస్తారని నాకు తెల్సు.

ఇక చివరగా ఇందాక చెప్పిన తప్పటడుగు విషయం !

నాన్నా !

నువ్వు ఆ వుద్యోగంలో చేరడం విశితంగా ఆలోచించి చూస్తే తప్పటడుగు కాకపోవచ్చు.

అసలా వుద్యోగమే పెద్దవూబి.

పైకి షోకు షోగ్గా కన్పిస్తూనే తనివైపు వచ్చిన వాళ్ళను తనలోనికి లాక్కుని వాళ్ళ ప్రాణాన్ని నిలువునా బలితీసుకుంటుంది దొంగ వూబి.

అక్షరాలా ఆ దొంగవూబిలాటిదే మీ వుద్యోగం కూడా.

ఏనాటికైనా ఎవరైనా శ్రద్ధ వహించి వూబిలో బురదనంతా తోడి, మరమ్మతు చేస్తేగానీ ఆ ప్రదేశం జనసంచార యోగ్యంకాదు. అలాగే ఈ వుద్యోగానికి కూడా చుట్టూవున్న పరిస్థితులనూ చట్టాలనూ ఎంతో సంస్కరిస్తేగానీ దాన్ని నమ్ముకున్న వుద్యోగులు హాయిగా బ్రతుకలేరు. ఆ మంచిరోజు తప్పక వస్తుందని ఆశిస్తూ-

మీ ఇద్దరికీ నమస్సులతో,
మోహన్"

చదవడం పూర్తయింది.

సుబ్బారావు కళ్ళు తడి కాలేదు. శిలా ప్రతిమలా అలాగే వుండిపోయాడు. ఎంతో సేపటికి అన్నాడు అస్పష్టంగా. "ఎంత పని చేశావు మోహన్ ! ఎంత పని చేశావు ?"

"మంచిపనే చేశాడేమో, కష్టాలలో నుంచి సుఖాలలోకి తెలివిగా నడిచాడు గదూ" పిచ్చిగా చూస్తూ అంది ఇందిర.

సుబ్బారావు భయంతో విలవిల్లాడి పోయాడు. ఇందిర ఎందుకలా పిచ్చి చూపులు చూస్తోంది ? ఏమైంది ఇందిరకు ?

"ఇందిరా !" దగ్గరగా తీసుకొని పొదివి పట్టుకున్నాడతను ఆమె కళ్ళలోకి పరీక్షగా చూస్తూ.

ఇందిర అతని గుండెలపై ఒరిగిపోతూ అంది. "ఇందిరనే. మీ ఇందిరనే. కానీ నాకేదో బాలోంది నేనేమై పోతున్నాను ?"

ఆమె పరిస్థితికి - శరీరంలో మృదువైన చోట దెబ్బ తగిలినంతగా బాధ పడ్డాడు సుబ్బారావు.

ఇందిర రెప్పలు బరువై క్రమేణా కళ్ళు మూసుకుంది. తర్వాత...తర్వాత...అతని చేతుల్లో బరువై అలాగే ... అలాగే ... క్రిందకు జారి పోయింది.

అప్పుడు స్ఫురణకు వచ్చింది సుబ్బారావుకు. ఏం జరుగుతున్నదో — "ఇందిరా ! ఇందిరా !" అంటూ అటూ యిటూ భుజాలు పట్టుకుని కదిపి చూశాడు.

ఎంతకూ సమాధానం రాకపోవడంతో చెల్లా చెదరవుతున్న ఆశల మధ్య నాడి పరిక్షించి చూశాడు మరేమీ తోచక చివరకు.

భగవాన్ ! కష్టాలతో తలమున్కలవుతున్న వారికే ఇంకా ఇంకా కష్టాలు కల్పిస్తున్నావా ప్రభూ !

అంతా బహోయింది.

ఇందిర ఈ పాడు లోకాన్ని వదలి - శాశ్వతంగా వదలి - వెళ్ళిపోయింది ఏదూర తీరాలకో.

"ఇందిరా - ఇందిరా" నుదురు కొట్టుకున్నాడతను.

ఇందిర తన నొదలి వెళ్ళి పోయింది. ఇన్నేళ్ళుగా తన కష్టాలలో భాగం పంచుకున్న ఇందిర - ఆశించిన ఫలితాలలో ఒక్కటైనా చవి చూడకుండానే వెళ్ళి పోయింది విసిగివేసారి వెళ్ళిపోయింది.

అసలు ఏం జరిగిందో ఏం జరుగుతున్నదో - తానెక్కడున్నాడో కూడా తెలీని నిశ్చైతన్య స్థితిలో అలా ఎంతసేపో వుండిపోయాడు.

చాలా చాలా నిముషాలు గడచి పోయాక... సుబ్బారావు తలలో ప్రేళ్ళు జొనుపుకొని పిచ్చివాడిలా తల రేపుకో సాగాడు. అతని మనసు చుట్టూ మళ్ళీ ఆలోచనలు చలిచీమల్లా ముసురుకున్నాయి.

ఎంత భయంకరమైన రోజిది !

మోహన్ తన అసమర్థతను భరించలేక మిలటరీలో చేరిపోయాడు.

ఇందిర తన అసమర్థతకు బలై యీ పాడు లోకాన్నే వదలి వెళ్ళిపోయింది

తాను - తాను మిగిలిపోయాడు, ఈ జ్ఞాపకాలతో జీవితాంతం కుమిలి కుమిలి పోయేందుకు.

ఈ జీవితం ఎందుకిలాబంది? ఈ వుద్యోగంలో చేరడం వల్లనేనా ?

చేరిన వాళ్ళంతా యిలాగే బౌతున్నారా ? కాకపోవచ్చు - కాకున్నా యిన్నికష్టాలూ మరోరకంగా మరో రకంగా వాళ్ళ జీవితాలను తినేస్తూనే

జాతీయ అంతర్జాతీయ రాజకీయ
అవగాహనకు....

వారం వారం

"ఆంధ్రవాణి"

చదవండి.

వుంటాయి. నిజం !

ఇలాంటి వుద్యోగాలు పురుగుపడ్డ మొక్కల్లాంటివి. ఆ భయంకరమైన పురుగులను తొలగించేందుకు ఎవరూ తోడ్పడరు. ఎవరూ ముందుకు రారు. ఎవరికీ అవసరం లేదు. ఇలా కొన్ని జీవితాలు బలికావలసిందే !

సుబ్బారావులో చెలరేగే సంఘర్షణ వేయి శిఖలతో పైకి జ్వాజ్వల్యమానంగా లేచి అతని మనసును వేడెక్కిస్తోంది.

ఎవరో ఎందుకు రావాలి నిజానికి ? ఎవరూ రానవసరం లేదు. ఇందులో వున్నవాళ్ళే ఈ పరిస్థితుల నుంచి రక్షణ కల్పించుకోవాలి.

నేనున్నాను. ఔను నేనున్నాను. సాటి సోదర వుద్యోగులను కర్తవ్య పరాయణులను చేస్తాను. వారిలో నవచైతన్యాన్ని కల్గిస్తాను. పురుగుపడ్డ మొక్కల్లాంటి ఈ వుద్యోగాల్లో పురుగులను తొలగించేందుకు ప్రతి వుద్యోగీ నడుంకట్టి నిలబడే పరిస్థితి కోసం నా సర్వశక్తులూ వినియోగించి ప్రయత్నిస్తాను.

పైవారి మనసులనూ, ప్రవర్తననూ మార్చేందుకు కృషి చేస్తాను. వందలాది సీజనల్ వుద్యోగులు నా వెనుక నిలచి నన్ను ప్రోత్సహిస్తారు.

నా సాటి సోదరుల జీవితాలలో శాంతి సౌఖ్యం వెల్లి విరిసేందుకు అడ్డుగా నిలుస్తున్న రకరకాల నిబంధనలను, చట్టాలను మార్పించేందుకు మేనేజ్మెంట్‌తోనూ. ప్రభుత్వంతోనూ ప్రాణాలొడ్డి పోరాడుతాను.

నాలా-మరో వుద్యోగి జీవితం అంధకారంలో మునిగి పోకముందే - నా కుటుంబంలాగా మరో కుటుంబం బలై పోకముందే - నా సోదర వుద్యోగస్తులందరినీ కళ్ళు తెరిపిస్తాను.

ఔను ! సమిష్టి బలంతో విజయాన్ని సాధిస్తాను. ఆలోచనల మధ్యా, నిర్ణయాల మధ్యా - తలెత్తి చూచిన సుబ్బారావుకు దూరంగా జానకి రామయ్యగారొస్తూ కన్పించారు.

సుబ్బారావు చూపులు ఇందిర శవం వైపు మళ్ళాయి. కర్తవ్యం గుర్తుకు వచ్చి జానకి రామయ్యగారొస్తున్న వైపు నడిచాడు సుబ్బారావు.

★